సాక్షి రంగారెడ్డి

శనివారం । 6 । మే । 2023



హామీలు విస్మరించిన బీఆర్ఎస్

జేపీఎస్‌లకు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. 8లో▸

విదేశీ సిగరెట్ల స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: పాన్ ఇండియా డ్రైవ్‌లో భాగంగా ఆర్పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు నాంపల్లి రైల్వేస్టేషన్‌లో సుమారు రూ. 67.50 లక్షల విలువైన స్మగ్లింగ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నాంపల్లి స్టేషన్‌లో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో పోలీసులు అనుమానాస్పద స్థితిలో ఉన్న పార్శిళ్లను గుర్తించారు. తనిఖీల్లో 15 పార్శిళ్లు న్యూ ఢిల్లీలో లోడ్ చేసినట్లు తేలింది.

త్వరలో మహిళా పోలీస్‌స్టేషన్

బంజారాహిల్స్: ప్రతి జోన్‌కూ ఓ మహిళా పోలీస్ స్టేషన్ ఉండేలా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రతిపాదించారు. ఇందులో భాగంగా త్వరలోనే వెస్ట్‌జోన్ మహిళా పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రానుంది. యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్‌లో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు సీసీఎస్‌లో వెస్ట్‌జోన్, ఈస్ట్‌జోన్, సెంట్రల్‌జోన్ తదితర మూడు జోన్లకు కలిపి ఒకే మహిళా పోలీస్ స్టేషన్ ఉంది.

న్యూస్‌రీల్

'ది లండన్ స్కూల్'కు షాద్‌నగర్ విద్యార్థిని



నవ్యశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: అంతర్జాతీయ మానవ సంబంధాలపై అధ్యయనం చేసేందుకు పట్టణంలోని రైతు కాలనీకి చెందిన జీ లావణ్య, ఆనంద్ దంపతుల కూతురు నవ్యశ్రీ ది లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌కు ఎంపికైంది. ఈ మేరకు ఆ స్కూల్ హెడ్ సీమన్ బెట్లీ ప్రకటన జారీ చేశారు. విద్యార్థి నవ్యశ్రీ హైదరాబాద్‌లోని గాయత్రీ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ఢిల్లీలోని శ్రీరామ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందింది. అనంతరం అంతర్జాతీయ మానవ సంబంధాలపై అధ్యయనం చేసేందుకు ది లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఎంపికైంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శుక్రవారం విద్యార్థి నవ్యశ్రీ ఇంటికెళ్లి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ రాజావరప్రసాద్, మున్సిపల్ చైర్మన్ కే నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ గతిని మార్చిన కార్ల్‌మార్క్స్

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్: బహుముఖ ప్రజ్ఞాశాలి, సిద్ధాంతకర్త కార్ల్‌మార్క్స్ ప్రపంచ గతిని మార్చి సోషలిజానికి బాటలు వేశారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. శుక్రవారం కార్ల్‌మార్క్స్ 205వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కార్ల్‌మార్క్స్ రచించిన సిద్ధాంతాలను కొనియాడారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు శివారెడ్డి, నర్సింలుగౌడ్, మండల కార్యదర్శి సత్యం, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయక్, నాయకులు వెంకటరమణ, కృష్ణ, చంద్రమౌళి పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఆర్‌డీఓ బదిలీ



రాజేశ్వరీ

షాద్‌నగర్: షాద్‌నగర్ ఆర్‌డీఓ రాజేశ్వరీని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమెను కొముంరంభీం ఆసిఫాబాద్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. కందుకూరు ఆర్‌డీఓ సూరజ్‌కుమార్‌కు షాద్‌నగర్ అదనపు బాధ్యతలు అప్పగించారు.

బాధ్యతలు స్వీకరించిన జడ్జి



జడ్జి అపర్ణను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

మహేశ్వరం: మహేశ్వరం కోర్టు జడ్జిగా మల్లాడి అపర్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఫర్హీన్ కౌసర్ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన జడ్జి అపర్ణను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికృష్ణగౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శివకుమార్, క్రీడ, సాంస్కృతిక కార్యదర్శి ఎండీ నసీర్‌పాషా, రమేష్‌బాబు, శ్రీపాల్‌రెడ్డి, ఉమాచంద్రశేఖర్, పాండు, మల్లేష్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీశైలం బస్సులు ఇలా..

అఫ్జల్‌గంజ్: శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం బస్సుల సమయాలను క్రమబద్ధీకరించామని టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి 20, 30 నిమిషాలకో బస్సును అందుబాటులో ఉంచామని, ఎంజీబీఎస్ నుంచి మొదటి సర్వీసు ఉదయం 3.30 గంటలకు, చివరి సర్వీసు రాత్రి 11.45 గంటలకు ఉంటాయని ఆయన తెలిపారు. శ్రీశైలం నుంచి తిరుగు ప్రయాణంలో ఉదయం 4.30 గంటలకు, చివరి సర్వీసు రాత్రి 8 గంటలకు అందుబాటులో ఉంటాయన్నారు.



రాష్ట్రానికే తలమానికం.. హెరిటేజ్ టవర్



400 అడుగుల ఎత్తు
- రూ.200 కోట్లతో నిర్మాణం
- 8న సీఎం కేసీఆర్ భూమిపూజ



మాట్లాడుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

మణికొండ: మన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాల శిల్ప సౌందర్యాలను మోడ్రన్ పద్ధతిలో ప్రపంచానికి తెలియజేసేందుకు ఉద్దేశంతో నగర శివారు నార్సింగిలో హరేకృష్ణ హెరిటేజ్ టవర్‌ను నిర్మిస్తున్నామని, అది రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తుందని హరేకృష్ణ మూవ్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ శ్రీకృష్ణ గోశాల వారు జీవితకాల దానంగా ఇచ్చిన 6 ఎకరాల స్థలంలో రూ.200 కోట్లతో 400 అడుగుల ఎత్తు దేవాలయం నిర్మాణం అవుతుందన్నారు. తిరుమల దేవాలయ గెటప్‌తో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, మధుర, బృందావనం గెటప్‌తో శ్రీకృష్ణదేవాలయం నిర్మాణం అవుతుందన్నారు. మ్యూజియం, లైబ్రరీ, థియేటర్లతో పాటూ దేవాలయాల్లో జరిగే పూజలు ఆలయ టవర్‌పై లైవ్ ప్రదర్శన ఉంటుందన్నారు. దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా వచ్చే పర్యాటకులకు ఓ కేంద్రంగా ఇది నిలుస్తుందన్నారు. ఐదేళ్లలో నిర్మాణ పనులు పూర్తవుతాయని, సీఎం కేసీఆర్ చేతులమీదుగా ఈనెల 8న ఉదయం 11.30గంటలకు ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరుగుతుందని ఆయన తెలిపారు.

మేథస్సుకు పదును.. ఇదే అదను

రాష్ట్రపతి భవన్‌లో అతిథ్యం.. దేశ ప్రథమ పౌరురాలితో అభినందనలు.. కేంద్ర మంత్రులతో ప్రశంసలు.. దేశ దిగ్గజ శాస్త్రవేత్తలతో సమాలోచనలు.. ఇలాంటి అరుదైన అవకాశం వస్తుందంటే ఎవ్వరు కాదంటారు.. ఉత్తగా ఏపీ రావు.. కష్టపడాలి.. తమ మేథస్సుకు పదును పెట్టాలి.. అలాంటి అవకాశానికి వేదికే 'ఇన్‌స్పైర్ మనక్'

- విద్యార్థుల ఆవిష్కరణలకు ఆహ్వానం
- జాతీయ స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనక్'
- ప్రతిభ గల విద్యార్థులకు నగదు పురస్కారాలు
- ఆగస్టు 31వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

కేశంపేట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ప్రయోగాల వైపు నడిపించి, వారిలో వినూత్న ఆలోచనలకు పదును పెట్టి భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ఇన్‌స్పైర్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ద్వారా ఇన్‌స్పైర్ మనక్ అవార్డులను అందిస్తోంది. 10 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి 6 నుంచి 10వ తరగతి చదివే ప్రతిభ కలిగిన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లను 2023 - 24 విద్యా సంవత్సరానికిగాను స్వీకరిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఒక్క మిలియన్ విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలకు పదును పెట్టడమే ఇన్‌స్పైర్ మనక్ లక్ష్యం.

అర్హతలు

ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్‌కు అర్హులు. వీరు పాఠశాలలోని సైన్స్ టీచర్ గైడ్‌లైన్స్ పాటిస్తూ ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లకు దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేసుకునే విధానం

- ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- WWW.INPIQEAWAQD.DT.GOV.IN వెబ్‌సైట్‌లో వెళ్లి న్యూ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి.
- పాఠశాల వివరాలు నమోదు చేసి సేవ్ చేయాలి. ఇట్టి దరఖాస్తు జిల్లా అథారిటీకి వెళ్తుంది.
- వారు ఆమోదిస్తే విద్యార్థి పొందుపర్చిన మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది.
- అప్పుడు విద్యార్థులు యూజర్ ఐడీకి పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాలి.
- విద్యార్థి తన సమాచారంతో పాటు బ్యాంక్ ఖాతా నంబరు, ఆధార్ నంబరు నమోదు చేయాలి.
- విద్యార్థి ప్రదర్శించాలని అనుకున్న ప్రాజెక్టును సంక్షిప్తంగా వెబ్‌సైట్లో నమోదు చేయాలి.
- ఎంపికైన ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం విద్యార్థి బ్యాంక్ ఖాతాకు రూ. 10వేలు జమ చేస్తారు.
- రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టు ఎంపికైతే రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు అందజేస్తారు.
- ఆన్‌లైన్‌లో ఉచితంగా విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

గడువు.. ఆగస్టు 31

విద్యార్థులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 31వ తేదీ వరకు గడువు ఉంది. విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాలల్లో సైన్స్ టీచర్‌తో కలిసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. ఉపాధ్యాయుల సహకారంతో పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించాలి. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొనే విధంగా ఆయా పాఠశాలల సైన్స్ టీచర్లు కృషి చేయాలి.

– శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి, జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ హెచ్ఎం

306 ట్రాన్స్‌ఫార్మర్లు..173 కేసులు



వివరాలు వెల్లడిస్తున్న సీపీ చౌహాన్

- కాపర్ చోరీల కేసులో ముగ్గురి అరెస్టు
- మరో నలుగురి పరారీ
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ చౌహాన్

పహాడీషరీఫ్: ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను రాచకొండ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. 306 ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీ చేయడం ఒక ఎత్తయితే.. ప్రధాన నిందితుడిపై ఏకంగా 173 కేసులు నమోదు కావడం విశేషం. ప్రస్తుతం ముగ్గురు నిందితులను రిమాండ్‌కు పంపిన పోలీసులు.. మిగతా వారి కోసం గాలిస్తున్నారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఒడిశాకు చెందిన సహదేవ్ హాజీరా(32), యూపీకి చెందిన అభిమన్యు రాజ్‌బర్(37), నందులాల్ రాజ్‌బర్(30) కొన్నేళ్ల క్రితం మైలార్‌దేవ్‌పల్లి మధుబన్ కాలనీకి వచ్చి కూలి పనులు చేసుకుంటున్నారు. ఆ డబ్బు సరిపోకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు, కాయల్స్ చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. చోరీ సొమ్ముతో బైక్, కారు కొన్నారు. మొదట ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ప్రాంతాన్ని బైక్‌పై రెక్కీ నిర్వహించి రాత్రి పూట కారులో వెళ్లి తమ పనులను చక్కబెట్టేవారు. ఈ ముగ్గురికి మరో నలుగురు సహాయకులుగా ఉండేవారు. వీరు చోరీ చేసిన కాపర్‌ను కరిగించి చిన్న నర్సింహులు, మహేశ్, రమణారెడ్డి, రంజానీ జయశ్రీలకు విక్రయించే వారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ కాయల్, వైరు విక్రయిస్తే రూ.లక్ష వరకు వచ్చేది. ఇప్పటి వరకు 306 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్, కాయల్స్ అపహరించారు.

పట్టుబడిందిలా..

ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్, కాయల్స్ చోరీ విషయమై ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.. దీంతో ఎల్‌బీనగర్ క్రైమ్ బ్రాంచ్ డీసీపీ మధుకర్‌స్వామి, అదనపు డీసీపీ శ్రీనివాస్ దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 4న భువనగిరి రూరల్ ఠాణా పరిధిలోని రాయగిరి ఎక్స్‌రోడ్డు వద్ద ఇండికా కారులో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న సహదేవ్, అభిమన్యు, రాజ్‌బర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ విషయం బయట పడింది. నిందితుల వద్ద నుంచి రూ. లక్ష నగదు, 60 కిలోల కాపర్ వైరు, కారు, బైక్, సెల్ ఫోన్లు, చోరీలకు వినియోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారు.

ఒక్కసారిగా 173 కేసులు వెలుగులోకి..

ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సహదేవ్ 173 కేసుల్లో ప్రమేయం ఉన్నా ఇప్పటి వరకు పోలీస్ రికార్డుల్లోకి ఎక్కలేదు. ఒక్కసారిగా 173 కేసుల చిట్టా బయటపడింది. ఈ ముఠా రాచకొండలో -62, సైబరాబాద్ -06, వికారాబాద్ -69, సంగారెడ్డి -20, సిద్దిపేట -06, నల్గొండలో -10 చోరీలకు పాల్పడ్డారు. నిందితులలో సహదేవ్ -173, అభిమన్యు -84, నందులాల్ రాజ్‌బర్ -84, రాహుల్ -107, రాంచందర్ -84 కేసుల్లో నిందితులుగా ఉన్నారు.

రైతులు, ప్రభుత్వానికి నష్టం

రాత్రి పూట విద్యుత్ సరఫరా నిలిపి వేసి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న ఈ ముఠా వల్ల రైతాంగానికి, ప్రభుత్వానికి నష్టం కలిగించారని సీపీ చౌహాన్ తెలిపారు. చూడటానికి చిన్న చోరీ లాగే అనిపించినా ఎంతో మంది రైతులు తమ పంటలు ఎండబెట్టుకోవాల్సి వచ్చిందని తెలిపారు. సమావేశంలో మహేశ్వరం, భువనగిరి డీసీపీలు శ్రీనివాస్, రాజేష్ చంద్ర, క్రైమ్ బ్రాంచ్ డీసీపీ మధుకర్ స్వామి, ట్రైనీ ఐపీఎస్ ఛటోపాధ్యాయ, అదనపు డీసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

భవిష్యత్‌లో మరింత అభివృద్ధి

- మంత్రి సబితారెడ్డి
- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు

మహేశ్వరం: నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, ఇందు కోసం నిరంతరం పని చేస్తానని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మంత్రి జన్మదినం సందర్భంగా శుక్రవారం జిల్లెల్‌గూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఆమె నివాసంలో బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. మహేశ్వరం తోపాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, భవిష్యత్తులో మరింత తీర్చిదిద్దుతామని ప్రకటించారు. కార్యక్రమంలో రైతు కమిటీ జిల్లా సభ్యుడు కే యాదయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హెచ్ చంద్రయ్య, మండల అధ్యక్షుడు ఏ రాజునాయక్, నాయకులు చంద్రయ్య, అంజయ్య, దేవుల నాయక్, నర్సింహ యాదవ్, నవీన్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత పెరగాలి

చిలుకూరు బాలాజీ ఆలయం అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెరగాలని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. మండల పరిధిలోని అప్పోజీగూడలో నిర్మించిన బీరప్ప స్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగరాజన్ దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఊరిలో గ్రామదేవతలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెరగాలని.. అప్పుడే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు. దీంతో గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయన్నారు. బీరప్ప స్వామి, కామరాతిదేవి, మహంకాళీదేవి విగ్రహాలను, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠాపన చేశారు. ఉత్సవాల్లో సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

పరిధులపై అవగాహన కల్పించండి

అధికారులు, సిబ్బందికి కొత్వాల్ ఆనంద్ ఆదేశం

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో కొత్త పోలీసుస్టేషన్లు, ఏసీపీ కార్యాలయాలు, డీసీపీ ఆఫీసులు అమలులోకి వచ్చిన నేపథ్యంలో వాటి పరిధులపై బాధితులు, ఫిర్యాదుదారులకు అవగాహన కల్పించాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన శుక్రవారం సౌత్, సౌత్ ఈస్ట్ జోన్లలోని కొత్త పోలీసుస్టేషన్లు, ఇతర కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. సైదాబాద్, చంద్రాయణగుట్ట, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో ఉన్న శాంతి భద్రతల విభాగం, ట్రాఫిక్ ఠాణాలతో పాటు ఏసీపీ కార్యాలయాలను సందర్శించారు. కార్యాలయాన్నీ పరిశీలించారు. కొత్తగా నిర్మితమవుతున్న, అభివృద్ధి పనులు జరుగుతున్న ఠాణాలు, ఆఫీస్‌ల తీరుతెన్నులను స్వయంగా అధ్యయనం చేశారు. ఆయా ఠాణాలు, ఇతర కార్యాలయాల్లో పని చేసే మహిళా సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

కోర్టుల్లోనే పరిష్కరించుకోవాలి

సివిల్ కేసుల ఫిర్యాదుదారులకు రాచకొండ సీపీ చౌహాన్ సూచన

పహాడీషరీఫ్: నేరాల నివారణకు నగర శివారు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. శుక్రవారం ఆయన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఫిర్యాదుదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఈ కమిషనరేట్ పరిధిలోని ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉంటారన్నారు. అలాంటి వాటిని కోర్టుల్లో పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు సూచించారు. నేరాలకు పాల్పడి ఇతర రాష్ట్రాలకు పారిపోతున్న వారిని పట్టుకొని చట్టం ముందు నిలబెడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, ఏసీపీ అంజయ్య, ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ తాత గారూ.. మా నాన్నను రెగ్యులర్ చేయండంటూ ఓ చిన్నారి ప్లకార్డు ప్రదర్శన చేశాడు.. శుక్రవారం షాద్‌నగర్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంచాయతీ జూనియర్ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇక్కడ ఓ చిన్నారి ప్లకార్డు పట్టుకొని వారికి మద్దతుగా నిలిచాడు.

– షాద్‌నగర్ రూరల్

ప్రాణం తీసిన ఇన్‌స్టా రీల్ సరదా

రైలు ఢీకొని యువకుడి మృతి

సనత్‌నగర్: సోషల్ మీడియా మోజు యువత ప్రాణాల మీదకు తెస్తోంది. లైక్స్, వ్యూస్, సబ్‌స్క్రైబర్స్, ఫాలోవర్స్ తదితర వాటికోసం తహతహలాడుతున్న కొందరు హద్దులు దాటి ఫీట్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిలిస్తున్నారు. భవనాలపై సెల్ఫీలు, బైక్‌లపై ఫీట్స్, చెరువులు, రిజర్వాయర్ల వద్ద రీల్స్, ప్రమాదకరమైన చోట్ల షార్ట్ వీడియో షూటింగ్‌లతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నా తీరుమార్చుకోవడం లేదు. గతంలో ఎన్నో ఘటనలు చోటుచేసుకున్నా.. వాటిని సోషల్ మీడియాలో చూస్తున్నా పలువురిలో ఎలాంటి మార్పు రావడం లేదు. రైల్వే ట్రాక్ పక్కన నడుస్తూ ఇన్‌స్టా రీల్ షూట్ చేస్తున్న ఓ బాలుడిని ఎంఎంటీఎస్ రైలు ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయిన ఘటన సనత్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. రహమత్‌నగర్ ప్రాంతంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ సాదిక్ కుమారుడు మహ్మద్ సర్ఫరాజ్(16) స్థానిక మదర్సాలో ఇస్లామిక్ చదువుకుంటున్నాడు. ఇన్‌స్టాగామ్‌లో అకౌంట్ ఉన్న బాలుడు తన స్నేహితులు అంజద్, అహ్మద్‌తో కలిసి తరచూ రీల్స్ చేస్తూ ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేస్తుంటాడు. తన ఇద్దరు మిత్రులతో కలిసి సనత్‌నగర్ రైల్వే స్టేషన్ సమీప ప్రాంతానికి శుక్రవారం మధ్యాహ్నం చేరుకున్నాడు. రైలు వస్తుండగా సర్ఫరాజ్ ట్రాక్ వెంట నడుస్తున్న సన్నివేశాన్ని తన మిత్రులు సెల్‌ఫోన్‌లో షూట్ చేయిస్తున్నాడు. లింగంపల్లి నుంచి సనత్‌నగర్ వైపు వస్తున్న ఎంఎంటీఎస్ తన దగ్గరకు వస్తున్నా రైల్వే ట్రాక్‌పై నుంచి పక్కకు జరగకపోవడంతో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తరలించారు.

హత్య కేసులో అల్లుడికి జీవిత ఖైదు

రూ.500 జరిమానా

పటాన్‌చెరు టౌన్: మామను హత్య చేసిన కేసులో అల్లుడికి జీవిత ఖైదు పడింది. బీడీఎల్ సీఐ వినాయకరెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన ఖాజామియా కూతురు బిపాసాను రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన ఫకీర్ అలియాస్ సత్తార్‌కి ఇచ్చి వివాహం చేశారు. సత్తార్ మద్యానికి బానిసై భార్యను తరచూ వేధిస్తుండటంతో గతేడాది మార్చిలో ఆమె నందిగామలోని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో సత్తార్ అత్తగారి ఇంటికి వచ్చి అక్కడే ఉంటూ పటాన్‌చెరు మండలం కర్దనూరు సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడు. గతేడాది మే 18న సత్తార్ తన భార్య బిపాసాపై చేయిచేసుకున్నాడు. దీంతో ఆమె గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు పంచాయతీ కార్యాలయానికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న మామ ఖాజామియా(75)ను అల్లుడు సత్తార్ కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. బయటకు వెళ్లిన కూతురు ఇంటికి వచ్చి చూసేసరికి తండ్రి రక్తపు మడుగులో పడిఉన్నాడు. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భర్తపై ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో భాగంగా సత్తార్‌ను జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి ఎదుట హాజరుపరిచారు. శుక్రవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్‌రెడ్డి వాదోపవాదాలు విని సత్తార్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని పోలీసులు చెప్పారు. సత్తార్‌పై గతంలోనూ రంగారెడ్డి జిల్లా మేడిపల్లిలో ఐదేళ్ల బాలుడి హత్య కేసులో అభియోగం మోపగా హైకోర్టుని ఆశ్రయించాడు. దీంతో హైకోర్టు ఆ కేసును కొట్టేసింది.

సైకిల్‌ను ఢీకొట్టిన బైక్

కార్మికుడు మృతి

నందిగామ: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ కార్మికుడిని విధి వెక్కిరించింది. బైక్ ప్రమాదం రూపంలో ఆయన్ను మృత్యు ఒడికి చేర్చింది. ఈ ఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బలరాం మిశ్రా(50) 25 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం నందిగామకు వలస వచ్చాడు. వీర్లపల్లి శివారులోని జాగృతి స్టీల్ పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. పట్టణంలోని మసీద్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైళ్తున్న ఓ బైక్ అతివేగంగా వచ్చి సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బలరాం మిశ్రా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం అడవివెంకటాపురం గ్రామానికి చెందిన పాత్లావత్ శంకర్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు బిబుడెంట్ మిశ్రా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.


బలరాం మిశ్రా మృతదేహం


అకారణంగా యువకుడిపై దాడి

నిందితుడి రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్: అకారణంగా దాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన రఫి ఏప్రిల్ 24న రాత్రి 11గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో బైక్ ఆగిపోవడంతో సమీపంలోని పెట్రోల్ బంక్ సిబ్బందితో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో బాటసింగారం గ్రామానికి చెందిన మాదారం సాయికార్తీక్ అలియాస్ మున్నా మరో ముగ్గురు యువకులతో కలిసి రఫీపై దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం మున్నాను రిమాండ్‌కు తరలించారు. ఇప్పటికే సాయి కార్తీక్‌పై ఐదు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

సీఎం హామీకి ఐదేళ్లు

- నేటికీ పట్టాలెక్కని జేపీదర్గా అభివృద్ధి పనులు
- మాస్టర్‌ప్లాన్‌పై స్పష్టత కరువు
- భక్తులకు తప్పని ఇబ్బందులు



కొత్తూరు: కులమతాలకు అతీతంగా నిలుస్తూ భక్తుల రాకతో నిత్యం దేదీప్యమానంగా వెలుగొందుతున్న హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాను రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన దర్గాగా అభివృద్ధి చేస్తాం.. వంద ఎకరాల్లో రూ.50 కోట్లతో పర్యాటక క్షేత్రంగా మార్చడానికి వెంటనే పనులు ప్రారంభిస్తామని 2017 నవంబర్ 10న దర్గాలో మొక్కుబడి తీర్చుకునే సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. కాగా ఐదేళ్లు దాటుతున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికే దర్గా హుండీ టెండర్ల ద్వారా వక్ఫ్‌బోర్డుకు ప్రతీ ఏడాది కోట్లలో ఆదాయం ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలను కల్పించడం లేదు. దీంతో దర్గాను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రెండేళ్ల క్రితం నిధుల విడుదల

జేపీ దర్గాను పర్యాటక క్షేత్రంగా మార్చేందుకు వక్ఫ్‌బోర్డుతో పాటు పలువురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. వారు విడతల వారీగా ఇప్పటికీ పలుమార్లు దర్గాకు వచ్చి సర్వేలు, ఇతర అంశాలను పరిశీలించి ఓ మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. తర్వాత వంద ఎకరాల్లో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని అనుకున్నప్పటికీ 56 ఎకరాలను సూత్రప్రాయంగా గుర్తించి దానికి అనుగుణంగా మరో ప్లాన్‌ను సైతం రూపొందించి సీఎం అభిప్రాయం కోసం పంపారు. ఈ పనులకు ప్రభుత్వం రేండేళ్ల క్రితం రూ.కోటి నిధులు విడుదల చేసింది. నేటికీ తుది మాస్టర్‌ప్లాన్ రూపకల్పన పూర్తికాలేదు. ప్రస్తుతం జేపీ దర్గా ఆవరణలో వక్ఫ్‌బోర్డు పేరిట సర్వే నంబర్ 200లో 1.35ఎకరాలు, 201లో 25 ఎకరాల పొలం ఉంది. కొంత మేర పట్టాభూములు, మరికొంత సమీపంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని మాస్టర్‌ప్లాన్ రూపొందించాల్సి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు పెద్దగా దృష్టిసారించడం లేదనే ఆరోపణలున్నాయి.

మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచిన అంశాలు

- విశాలమైన రోడ్లు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం
- భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం
- భక్తులు న్యాజ్ చేసుకోవడానికి షెడ్ల నిర్మాణం
- చిన్నారులు, భక్తులు సేద తీరేందుకు పార్క్ ఏర్పాటు
- వీఐపీలకు ప్రత్యేక కాటేజీల నిర్మాణం
- షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం
- 24 గంటల విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి, టాయిలెట్స్ నిర్మాణం

ప్రస్తుత సమస్యలు

- తాగునీటికి ఇబ్బందులు తప్పవు.
- టాయిలెట్స్ నిర్వహణలోపం
- అధ్వానంగా అంతర్గత రహదారులు
- న్యాజ్‌లు నిర్వహించే షెడ్లలో స్లాటర్‌హౌస్(కబేళా)లు లేక మేకలు, గొర్రెల వ్యర్థాలను ఆరుబయట వేస్తుండడంతో దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి
- బస్టాండ్ లేక ప్రయాణికుల ఇబ్బందులు
- పారిశుద్ధ్య సిబ్బంది నలుగురే ఉండడంతో అపరిశుభ్రంగా మారుతోంది.
- చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించడంతో ట్రాఫిక్ అంతరాయం.

ప్రణాళిక రూపొందిస్తున్నాం

జేపీదర్గా ఆవరణలో స్థానికులు, వ్యాపారులతో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. మాస్టర్‌ప్లాన్ అమలుతో స్థానికుల ఆస్తులకు నష్టం వాటిల్లుతుంది. ఎవరికీ నష్టం లేకుండా ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఈ విషయమై ఇప్పటికే పలు దఫాలుగా వక్ఫ్‌బోర్డు అధికారులతో పాటు నేను వ్యాపారులతో చర్చలు జరిపాం. జేపీదర్గాను అభివృద్ధి చేస్తే ఇతర రాష్ట్రాల నుంచి సైతం పర్యాటకులు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. తద్వార స్థానికులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అంజయ్యయాదవ్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


దగ్ధమైన వస్తువులను చూపుతున్న బాధితురాలు

కందుకూరు: విద్యుదాఘాతంతో ఓ ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని సత్యనారాయణకు చెందిన ఇంటిని ఓ మహిళకు అద్దెకు ఇచ్చాడు. ఆమె శుక్రవారం ఉదయం పనిపై బయటికి వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో విద్యుదాఘతంతో మంటలు చెలరేగడంతో ఇరుగుపొరుగు వారు గుర్తించి మంటలార్పేశారు. కాగా అప్పటికే ఇంట్లోని విలువైన వస్తువులన్నీ అగ్నికి ఆహుతి అయ్యాయి. దీంతో బాధితురాలు కన్నీరుమున్నీరయింది.

హైనా దాడిలో దూడ మృతి

యాచారం: మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో గురువారం రాత్రి హైనా దాడిలో ఒక దూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన రాములు తన వ్యవసాయ పొలం వద్ద పాడి గెదేలను కట్టేసి గురువారం సాయంత్రం ఇంటికొచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా దూడ మృతి చెంది ఉంది. అదే విధంగా నస్దిక్‌సింగారం గ్రామంలో వీధి కుక్కల దాడిలో శుక్రవారం ఉదయం రైతు పుణ్యమూర్తి రాములుకు చెందిన దూడ మృతి చెందింది. వీధి కుక్కలు దూడపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో దూడ అక్కడికక్కడే మృతి చెందింది.

కోడి పందేలు ఆడుతున్న ఎనిమిది మంది అరెస్ట్


ఎస్‌ఓటీ పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ వ్యక్తులు

శంషాబాద్: ఓ ఫాంహౌస్‌లో కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులతో పాటు ఆడుతున్న వారిని శంషాబాద్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గగన్‌పహాడ్‌లోని ఆర్కే గార్డెన్ సమీపంలో ఓ ఫాంహౌస్‌లో డబ్బులు పెట్టి కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం ఉదయం దాడులు చేశారు. బిందురాజు అనే వ్యక్తితో పాటు మరో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.23 వేల నగదు, నాలుగు స్మార్ట్‌ఫోన్‌లు, మూడు కోడిపుంజులు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

- 25 మంది అరెస్ట్
- రూ.3.19లక్షల నగదు, 20 సెల్ ఫోన్లు స్వాధీనం


పోలీసుల దాడిలో పట్టుబడిన నగదు, సెల్‌ఫోన్లు

కడ్తాల్: గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న 25మంది పేకాటరాయుళ్లను ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి తెలిపిన ప్రకారం .. మండల పరిధిలోని మైసిగండి ఆలయ సమీపంలోని డీఎల్‌ఆర్ గెస్ట్ హౌస్‌లో పేకాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు సాయంత్రం ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా గెస్ట్ హౌస్‌పై దాడి చేసి గోల్కొండ ప్రాంతానికి చెందిన 25 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 20 సెల్‌ఫోన్లు, రూ.3.19లక్షల నగదు, ఐదు సెట్ల పేకలను స్వాధీనం చేసుకున్నారు. గెస్ట్ హౌస్ నిర్వాహకుడితో పాటు, పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి, ఎస్‌ఓటీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్


జేపీఎస్‌లకు మద్దతు తెలుపుతూ దీక్షలో కూర్చున్న ప్రొఫెసర్ కోదండరాం

- గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం
- రెగ్యులరైజ్ చేయకుంటే ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తాం
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

షాద్‌నగర్‌రూరల్: పంచాయతీ జూనియర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని తెలంగాణ జన సమితి (టీజేఎస్)రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పంచాయతీ జూనియర్ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 8వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ప్రొఫెసర్ కోదండరాం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ జూనియర్ కార్యదర్శులు నోటిఫికేషన్‌లోనే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి.. నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలం పూర్తైనా క్రమబద్ధీరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో పచ్చదనం, పరిశుభ్రత వంటి కార్యక్రమాలను చేపడుతూ తెలంగాణ రాష్ట్రానికి, గ్రామ పంచాయితీలకు జాతీయ స్థాయిలో అవార్డులను సాధించడంలో జేపీఎస్‌ల కృషి ఎంతో ఉందన్నారు. జేపీఎస్‌ల సమ్మెకు ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు పూర్తి మద్దతు తెలపాలని కోరారు. రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులతో రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి కలిసికట్టుగా పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఔట్ సోర్సింగ్, పంచాయతీ జూనియర్ క్యాదర్శుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలి

నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తామన్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను వెంటనే చేపట్టాలని ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. సాగునీటికి పెద్ద పీట వేస్తామని చెపుతున్న సీఎం కేసీఆర్ దక్షిణ తెలంగాణపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పనులను వేగవంతంగా చేపట్టి ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కేవీ రంగారెడ్డి, పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, తాలుకా అధ్యక్షుడు శ్రీరామ్, పంచాయతీ జూనియర్ కార్యదర్శులు జగదీశ్, ప్రమోద్, శ్రీరామ్, పాండురంగారెడ్డి, ఫయాజ్, అశోక్, వెంకటేశ్, స్వప్న, రజని, శ్వేత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలి


అదనంగా నిర్మించిన భవనం స్లాబ్‌ను కూల్చిన సిబ్బంది

మణికొండ: తీసుకున్న అనుమతుల కన్నా అదనంగా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 10లో ఓ బిల్డర్ జీప్లస్ 4 అంతస్తులకు అనుమతులు తీసుకుని మరో అంతస్తు అదనంగా నిర్మించారు. దాంతో శుక్రవారం అదనపు అంతస్తు స్లాబ్‌లను కట్ చేశారు. అదే టౌన్‌షిప్‌లో రోడ్డు నెంబర్ 2లో సిల్ట్ ప్లస్ 5 అంతస్తులకు అనుమతులు తీసుకుని మరో అంతస్తు నిర్మాణానికి వేసిన సెంట్రింగ్‌ను పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాలంలో తీసుకునే విధంగా టీఎస్ బీపాస్‌ను అమలు చేస్తుందని, అందులో తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అందుకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో టీపీఓ రాకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


లక్ష్మమ్మ(ఫైల్)

ఆమనగల్లు: మతి స్థిమితం సరిగా లేని మహిళ ఈ నెల 4న అదృశ్యమైంది. ఎస్‌ఐ సుందరయ్య తెలిపిన ప్రకారం.. అచ్చంపేట మండలం వలపట్ల గ్రామానికి చెందిన కాలె లక్ష్మమ్మ గురువారం ఆమనగల్లు బస్టాండ్ ఆవరణలో తప్పిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.